సాక్షి ఖమ్మం

శుక్రవారం । 15 । మార్చి । 2024

I



లహరిలో.. లాహిరిలో...

బెర్త్‌లతో రూపొందించిన ఆర్టీసీ లహరి బస్సులు పదింటిని ఖమ్మం రీజియన్‌కు కేటాయించగా మంచి ఆదరణ లభిస్తోంది.

IIలో



గాలికుంటు కట్టడి..


పశువుల్లో గాలికుంటు వ్యాధిని కట్టడి చేసేందుకు నేటి నుంచి నెల పాటు ఉచితంగా వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టనున్నారు.

IIలో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 36° / 23°

జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచే ఎండ మొదలవుతుంది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రత గరిష్టస్థాయికి చేరే అవకాశముంది.



టికెట్.. టెన్షన్

ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్, బీజేపీ టికెట్ ఆశిస్తున్న నేతల్లో టెన్షన్ పట్టుకుంది. ఇప్పటికే బీఆర్‌ఎస్.. తమ అభ్యర్థిగా సిట్టింగ్ అయిన నామా నాగేశ్వరరావును ప్రకటించింది. ఇక కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఎవరనే ఉత్కంఠకు ఇంకా తెర పడడం లేదు. ఉమ్మడి జిల్లాలోని ఇల్లెందు, భద్రాచలం, పినపాక అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ప్రకటించినా ఖమ్మం స్థానం మాత్రం పెండింగ్‌లో పెట్టాయి. బలమైన అభ్యర్థులనే రంగంలోకి దింపేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తుండగా.. ఆశావహులు కొందరు ఢిల్లీలో మకాం వేసి తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం



కాంగ్రెస్, బీజేపీ ఆశావహుల్లో హైరానా

- పోటాపోటీతో టికెట్ ఎవరికి వస్తుందోనని ఉత్కంఠ
- ఇప్పటికే ఢిల్లీలో మకాం వేసిన పలువురు..
- తమ నేతకే టికెట్ ఖాయమంటూ కాంగ్రెస్ శ్రేణుల హడావుడి
- జలగం చేరినా టికెట్ పెండింగ్‌లో పెట్టిన బీజేపీ అధిష్టానం

జలగం శిబిరంలో టెన్షన్

బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరిన నేతలు పలువురికి బీజేపీ అధిష్టానం లోక్‌సభ టికెట్లు కేటాయించింది. కానీ తమ నేత చేరినా అభ్యర్థిత్వం ప్రకటించడంతో జలగం వెంకట్రావు శిబిరంలో టెన్షన్ నెలకొంది. బీజేపీ అధిష్టానం ఇంకో నేత కోసం ఎదురుచూస్తున్నందునే ఖమ్మం అభ్యర్థిని ప్రకటించలేదని తెలుస్తోంది. దీంతో జలగం శిబిరం హైరానా పడుతోంది. కాగా, జలగం రాజకీయ అరంగేట్రం చేసినప్పటి నుంచీ టికెట్ విషయంలో పలుమార్లు ఉత్కంఠే కొనసాగింది. 2004లో కాంగ్రెస్ నుంచి సత్తుపల్లిలో పోటీ చేసి గెలిచిన ఆయన 2009లో ఖమ్మం టికెట్ ఆశించినా ఫలితం దక్కలేదు. యూనిస్ సుల్తాన్‌కు కాంగ్రెస్ టికెట్ ఇవ్వగా జలగం స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఇక టీఆర్‌ఎస్‌లో చేరాక 2014లో కొత్తగూడెం నుంచి పోటీ చేసి గెలిచారు. మళ్లీ అదే స్థానంలో 2018లో బరిలోకి దిగినా ఓటమి ఎదురైంది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన వనమా వెంకటేశ్వరరావు బీఆర్‌ఎస్‌లో చేరడంతో జలగంకు గత అసెంబ్లీ ఎన్నికల్లో చుక్కెదురైంది. వనమాకే బీఆర్‌ఎస్ టికెట్ ఇవ్వడంతో జలగం ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా పోటీ చేసి ద్వితీయ స్థానంలో నిలిచారు. ప్రస్తుతం బీజేపీలో చేరి ఖమ్మం లోక్‌సభ టికెట్ ఆశించినా అధిష్టానం ఇంకా తేల్చకపోవడం ఆయన అనుచరుల్లో చర్చకు దారి తీసింది.

కాంగ్రెస్‌లో పీటముడి

ఖమ్మం అభ్యర్థిని ఎంపిక చేయడం కాంగ్రెస్‌కు కత్తి మీద సాములా మారినట్లు తెలుస్తోంది. ఎక్కువ మంది ఆశావహులు ఉండడం, ఎవరికి వారు అధిష్టానం వద్ద పైరవీ చేస్తుండడంతో ఎంపిక క్లిష్టంగా మారినట్లు చెబుతున్నారు. ఈ స్థానం నుంచి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి నందిని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోదరుడు ప్రసాద్‌రెడ్డి, మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్‌తో పాటు ప్రముఖ వ్యాపారి వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అంతేకాక పార్టీ నేతలు జెట్టి కుసుమకుమార్, వీహెచ్ కూడా టికెట్ రేసులో ఉన్నారు. అయితే, తమ నేతకే టికెట్ ఖాయమని మల్లు నందిని అనుచరులు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారు. కాగా, కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీకి ఖమ్మం కోసం మూడు పేర్లే వెళ్లాయని తెలుస్తున్నా, ఆశావహులు ఎవరికి వారు తమకే టికెట్ అన్న ధీమాతో ఉన్నారు. అయినా అధిష్టానం ఎటూ తేల్చకపోవడం చర్చనీయాంశంగా మారింది.

బీజేపీ ఆచితూచి..

రాష్ట్రవ్యాప్తంగా బీఆర్‌ఎస్ నేతలు పలువురు ఇటీవల బీజేపీలో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో హుజూర్‌నగర్ స్థానం పోటీ చేసి ఓడిపోయిన శానంపూడి సైదిరెడ్డి బీజేపీలో చేరగా.. నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించారు. మాజీ ఎంపీ సీతారాం నాయక్ బీజేపీలో చేరగానే మహబూబాబాద్ టికెట్ కేటాయించారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు సైతం బీజేపీలో చేరడంతో ఆయనకే ఖమ్మం నుంచి కమలం టికెట్ ఖరారవుతుందని ప్రచారం జరిగినా అధిష్టానం పెండింగ్‌లో పెట్టింది. దీంతో ఆశావహులు తమనే అధిష్టానం అభ్యర్థిగా ఎంపిక చేస్తుందని ప్రచారం చేసుకుంటున్నారు. ఖమ్మం స్థానానికి కాంగ్రెస్ సైతం అభ్యర్థిని ప్రకటించకపోవడంతో బీజేపీ కూడా బలమైన అభ్యర్థి కోసం ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఓ ప్రముఖ పార్టీ నేత బీజేపీలోకి వస్తారనే ప్రచారం జరగగా.. అధిష్టానం ఎదురుచూస్తున్నట్లు సమాచారం.

పాఠశాలల్లో 'అమ్మ ఆదర్శ' కమిటీలు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్, అధికారులు

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటుచేసి కనీస మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి ఆమె గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాల నిర్వహణ బాధ్యతలను స్వశక్తి మహిళా సంఘాలకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు ప్రతీ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటుచేయాలని, కమిటీకి మహిళా సంఘం నాయకురాలు అధ్యక్షురాలిగా, హెచ్‌ఎం మెంబర్ కన్వీనర్ గా ఉంటారని చెప్పారు. గ్రామంలో రెండు, మూడు సంఘాలు ఉంటే పాఠశాలకు సమీపంలోని సంఘానికి తొలుత అవకాశం ఇవ్వాలని సూచించారు.

ఆతర్వాత రెండేళ్లకు కొనసాగే కమిటీలో విద్యార్థుల తల్లులను సభ్యులుగా ఎంపిక చేయాలని తెలిపారు. అంతేకాకుండా కమిటీ పేరిట బ్యాంక్ ఖాతా తెరవాలని సూచించారు.

యూనిఫాం కుట్టే బాధ్యతలు...

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్ కుట్టే బాధ్యతను సైతం స్వశక్తి మహిళా సంఘాలకు కేటాయిస్తున్నట్లు సీఎస్ తెలిపారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా యూనిఫాం కుట్టే సామర్థ్యం కలిగిన మహిళా సంఘాలను గుర్తించి ఆర్డర్ ఇవ్వాలని సూచించారు. ఇక తాగునీటి సౌకర్యం, తరగతి గదుల మరమ్మతులు, టాయిలెట్లను వినియోగంలోకి తీసుకురావడం, బాలికల కోసం అదనపు టాయిలెట్ల నిర్మాణం, విద్యుత్ వసతుల కల్పన బాధ్యతలను జూన్ 10వ తేదీలోగా అమ్మ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు. ఈ మేరకు పనులను గుర్తించి కలెక్టర్లు పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని, కమిటీల వద్ద ఉండే రూ.25 వేల నిధులను అత్యవసర పనులకు వినియోగించవచ్చని వెల్లడించారు. ఈ వీసీలో జిల్లా నుంచి కలెక్టర్ వీ.పీ.గౌతమ్, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, డీఈఓ సోమశేఖరశర్మ, డీఆర్‌డీఓ సన్యాసయ్య, సీపీఓ శ్రీనివాస్, మైన్స్ ఏడీ సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికలకు పటిష్టమైన నిఘా

- అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు
- రెండు రాష్ట్రాల పోలీసు అధికారుల సమీక్షలో నిర్ణయం



సమీక్షలో పాల్గొన్న రెండు రాష్ట్రాల అధికారులు

ఖమ్మంక్రైం: పార్లమెంట్ ఎన్నికల వేళ అక్రమాలు జరగకుండా కట్టడి చేసేందుకు ఇరు రాష్ట్రాల పోలీసులు సహకరించుకోవాలని నిర్ణయించారు. తెలంగాణ, ఏపీ సరిహద్దుల్లో భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై రెండు రాష్ట్రాల్లోని పలు జిల్లాల పోలీసులు అధికారులు గురువారం ఏపీలోని మైలవరం ఏసీపీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సరిహద్దుల మీదుగా నగదు, మద్యం రవాణాను కట్టడి చేసేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటుచేయడంపై సమీక్షించారు. కీలక ప్రాంతాల్లో 24గంటల పాటు కొనసాగేలా చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి వాహన తనిఖీలు చేపట్టాలని, తద్వారా మద్యం, నగదుతో పాటు గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను కట్టడి చేయొచ్చని నిర్ణయించారు. అంతేకాక నాన్ బెయిల్‌బుల్ వారెంట్లు ఉన్న నిందితులు, పాత నేరస్తుల సమాచారం ఇచ్చిపుచ్చుకుంటే ప్రత్యేక నిఘా వేయొచ్చనే భావనకు వచ్చారు. అలాగే, సమస్మాత్మక గ్రామాలపై దృష్టి సారించి నిత్యం తనిఖీలు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, కల్లూరు, వైరా, ఎస్‌బీ ఏసీపీలు రఘు, రెహమాన్, ప్రసన్నకుమార్, ఏపీలోని పలు ప్రాంతాల డీఎస్పీలు కిరణ్‌కుమార్, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8.30గంటలకు పోలేపల్లిలోని గురుదక్షిణ ఫౌండేషన్‌లో స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన జరిగే ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొంటారు. ఆతర్వాత ఖమ్మంలోని పలు డివిజన్లలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలతో పాటు మధ్యాహ్నం అల్లీపురం నుండి కొదుమూరు రోడ్డు విస్తరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేస్తారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా శ్రీనివాసరావు



ఏలూరికి శుభాకాంక్షలు తెలుపుతున్న టీజీవోస్ బాధ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా ఏలూరి శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయన కలెక్టర్ వీ.పీ. గౌతమ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఈడీగా ఉన్న నవీన్‌బాబు నుండి బాధ్యతలు తీసుకున్నారు. ఇటీవలే టీజీఓస్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన ఏలూరి ఈడీగా విధుల్లో చేరిన సందర్భంగా టీజీవోస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి, ఉపాధి కల్పన అధికారి కొండపల్లి శ్రీరామ్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, వివిధ శాఖల ఉద్యోగులు, సంఘాల ప్రతినిధులు రమేష్, వల్లోజి శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, కృష్ణకుమారి, విజయ్‌కుమార్, కొణిదల శ్రీనివాసరావు, గుంటుపల్లి శ్రీనివసారవు, పొట్టపింజర రామయ్య, గంగవరపు బాలకృష్ణ, దుర్గాప్రసాద్, ప్రకాశ్ రవిచంద్ర, తాళ్లూరి శ్రీకాంత్, కోటపాటి రుక్మారావు, నెల్లూరి నాగేశ్వరరావు, రాజేష్, మీరా సాహెబ్ కూడా ఆయనను కలిశారు.

రేపు జాతీయ లోక్ అదాలత్

ఖమ్మం లీగల్: జిల్లాలోని అన్ని కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావేద్ పాషా తెలిపారు. జిల్లా కోర్టులో గురువారం మధ్యాహ్నం ఆయన మెజిస్ట్రేట్లతో సమావేశమై మాట్లాడారు. కోర్టుల వారీగా కేసుల పరిష్కారం, వివరాలు ఆరా తీశారు. కొన్ని పోలీస్‌స్టేషన్లలో లోక్‌క్షిదారులను సమన్వయపరిచేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయలేదని తెలుసుకున్న ఆయన లైజన్ అధికారికి సూచనలు చేశారు. ఈసమావేశంలో మెజిస్ట్రేట్లు గోపిక నాగశ్రావ్య, కె.దీప, వై.బిందుప్రియ, వి.మాధవి, ఆర్.శాంతిలత, బి.రజిని పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు



విద్యార్థులకు ప్యాడ్లు అందజేస్తున్న డీఈఓ

కూసుమంచి: రానున్న వేసవి సెలవుల్లో విద్యార్థులను తీర్చిదిద్దేలా బ్రిడ్జి కోర్సు ప్రవేశపెడుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ తెలిపారు. కూసుమంచిలోని జెడ్పీహెచ్‌ఎస్ వార్షికోత్సవ వేడుకలు గురువారం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. వేసవి సెలవుల్లో ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు బ్రిడ్జికోర్సు నిర్వహించనుండగా, తొమ్మిదో తరగతి పూర్తిచేసే విద్యార్థులకు ముందస్తుగా ఎస్సెస్సీ బోధన ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కాగా, విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకు శ్రమించాలని సూచించారు. కూసుమంచి పాఠశాలలో చదివిన మహేందర్ రెడ్డి డీజీపీగా విధులు నిర్వర్తించి టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా ఎంపిక కాగా, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సైతం ఇక్కడే చదివారని గుర్తు చేశారు. అనంతరం జేవీఆర్ కళాశాల తరఫున సమకూర్చిన పరీక్ష సామగ్రిని డీఈఓ విద్యార్థులకు అందజేయగా, అల్పాహారం కోసం మాజీ సర్పంచ్ చెన్నా మోహన్, వ్యాపారి గంగాధర్ నగదు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంఈఓ బీ.వీ.రామాచారి, హెచ్‌ఎంలు వీరస్వామి, వెంకటరెడ్డి, జేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్‌రెడ్డితో పాటు ఎంపీటీసీ మాదాసు ఉపేందర్, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ మైమూనా పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

- జిల్లాలో మొత్తంగా ముగ్గురి డీబార్
- ప్రతిరోజూ పర్యవేక్షించిన కలెక్టర్ గౌతమ్



పరీక్షా కేంద్రంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ముగియగా, ద్వితీయ సంవత్సరం చివరి పరీక్ష గురువారం జరిగింది. చివరిరోజు పరీక్షకు మొత్తం 16వేల మంది విద్యార్థుల్లో 15,526మంది హాజరు కాగా 474మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ రవిబాబు తెలిపారు. కాగా, ఖమ్మంలోని ఏఎస్‌ఆర్ శాంతినగర్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ వీ.పీ.గౌతమ్, మరో 33 కేంద్రాలను హెచ్‌పీసీ, డీఈసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి.

హాజరు ఇలా..

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు 70 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశారు. మొత్తంగా ప్రథమ సంవత్సరం పరీక్షలకు 18,481మందిలో 17,504మంది హాజరు కాగా 977మంది గైర్హాజరయ్యారు. ఇక ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 18,097మందికి గాను 17,589మంది హాజరు కాగా 508మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ తెలిపారు. జిల్లాలో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన ముగ్గురిని డీబార్ చేసినట్లు వెల్లడించారు.

కలెక్టర్ నిత్యపర్యవేక్షణ

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను కలెక్టర్ వీ.పీ.గౌతమ్ నిత్యం పర్యవేక్షించారు. జిల్లా కేంద్రంలో ఉంటే ప్రతీరోజు ఒక కేంద్రాన్ని తనిఖీ చేయడమే కాక జిల్లాలో ఎక్కడ పర్యటనకు వెళ్లినా అక్కడి కేంద్రాలను తనిఖీ చేస్తూ వసతులపై ఆరా తీశారు. ముందు నుంచే కలెక్టర్ అధికారులతో పలుమార్లు సమీక్షించి సూచనలు చేయడంతో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

కొనసాగుతున్న 'స్పాట్'

ఈనెల 4వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ జవాబుపత్రాల మూల్యాంకనం మొదలైంది. తొలుత సంస్కృతం సబ్జెక్ట్‌తో ఖమ్మంలోని నయాబజార్ కళాశాలలో స్పాట్ ప్రారంభించారు. ఈనెల 16నుంచి విడతల వారీగా ఇంగ్లిష్, తెలుగు, హిందీ, గణితం తదితర సబ్జెక్టు జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభం కానుంది.

దేవాదాయ శాఖ ఈఓ సస్పెండ్?

నేలకొండపల్లి: దేవాదాయ శాఖ నేలకొండపల్లి మండల ఈఓ పి.నారాయణచార్యులను ఉన్నతాధికారులు గురువారం సస్పెండ్ చేసినట్లు తెలిసింది. నేలకొండపల్లి ఈఓగా పనిచేస్తున్న ఆయన కూసుమంచి మండలంలోని పలు ఆలయాలకు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఇటీవల జీళ్లచెరువు శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ భూముల నుంచి అక్రమంగా మట్టి తరలించినట్లు తేలగా పలువురు నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆతర్వాత అధికారుల విచారణలో ఈఓ పర్యవేక్షణ లోపం తేలగా సస్పెండ్ చేసినట్లు తెలిసింది. ఈ విషయమై అసిస్టెంట్ కమిషనర్ సులోచనను వివరణ కోరగా ఈఓపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు.

మైనింగ్ ఏడీగా సాయినాథ్

ఖమ్మం అర్బన్: జిల్లా మైనింగ్ ఏడీగా సాయినాథ్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఏడీగా ఉన్న సంజయ్‌కుమార్‌ను మహబూబ్‌నగర్‌కు బదిలీ చేయగా, ఆయన స్థానంలో పెద్దపల్లిలో విధులు నిర్వర్తిస్తున్న సాయినాథ్‌ను కేటాయించారు. అలాగే, అసిస్టెంట్ జియాలజిస్ట్ జి.గంగాధర్‌ను ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ చేయగా తాండూర్‌లో పనిచేస్తున్న ఏ.రమేష్‌ను ఖమ్మం బదిలీ చేశారు. ఇంకా రాయల్టీ ఇన్‌స్పెక్టర్ వై.రాజారెడ్డిని మంచిర్యాలకు బదిలీ చేయగా ఆయన స్థానంలో పి.నాగరాజును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

వస్తు సేవా లోపాలు ఎదురయ్యాయా?

- కమిషన్‌ను ఆశ్రయిస్తే పరిష్కారం
- నేడు వినియోగదారుల హక్కుల దినోత్సవం



ఖమ్మం లీగల్: ప్రతీ ఒక్కరు ప్రతీరోజు ఏదో ఒక వస్తువును కొనుగోలు చేయడం పరిపాటి. తద్వారా వారందరూ వినియోగదారులుగా నమోదవుతారు. కానీ తమకు అందుతున్న సేవల్లో లోపాలు ఎదురైతే ఏం చేయాలో తెలియక, ఎవరిని ఆశ్రయించాలో అవగాహన లేక సర్దుకుంటున్నారు. అలా కాకుండా వస్తు సేవా లోపాలు ఎదుర్కొంటే జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించడం ద్వారా న్యాయం జరిగే అవకాశముంటుంది. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని శుక్రవారం జరుపుకుంటున్న సందర్భంగా కమిషన్ వివరాలను చైర్‌పర్సన్ పి.లలిత, సభ్యురాలు ఏ.మాధవీలత వెల్లడించారు.

జరిమానాతో పాటు శిక్ష కూడా...

వినియోగదారుల రక్షణ చట్టం 1986 స్థానంలో కొత్తగా వినియోదారుల హక్కుల పరిరక్షణ చట్టం – 2019ని తీసుకొచ్చారని చైర్‌పర్సన్ తెలిపారు. తద్వారా వినియోగదారులు నష్టపోతే అందుకు కారకులకు జరిమానాతోనే సరిపెట్టకుండా జైలుశిక్ష విధించే అవకాశముందని పేర్కొన్నారు. కొనుగోలు ఏ రూపంలో చేసినా ఎక్కడి నుంచైనా ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్లో ఇప్పటివరకు 10,100 కేసులు దాఖలు కాగా 9,922 కేసులను పరిష్కరించామని, ఇంకా 178 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. ఇందులో కీలకమైన 85 కేసుల్లో రూ.1.41 కోట్ల నష్టపరిహారాన్ని కక్షిదారులకు ఇప్పించామని తెలిపారు. ఇక కేసుల స్థితిని తెలుసుకునేందుకు ప్రస్తుతం ఉన్న వెబ్‌సైట్ స్థానంలో కొత్తగా ఈ – జాగృతి అనే వెబ్‌సైట్, యాప్ ఈనెల 20 నుంచి అందుబాటులోకి వస్తుందన్నారు. కాగా, వైద్యంలో లోపం, ఎయిర్‌లైన్స్, బీమా, పంటల విత్తనాలు, విద్యుత్, ఆర్టీసీ, చిట్ ఫండ్స్, రైల్వే, రియల్ ఎస్టేట్ తదితర అనేక అంశాలు వినియోగదారుల కమిషన్ పరిధిలో ఉన్నందున బాధితులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కోల్డ్ స్టోరేజీలకూ సోలార్ విద్యుత్

- 'కోల్డ్ చైన్' పథకం ద్వారా 35 శాతం రాయితీ
- ఈనెల 18 వరకు దరఖాస్తుల స్వీకరణ



ఖమ్మంవ్యవసాయం: పంటలకు మద్దతు ధర దక్కని సమయంలో రైతులు ఉత్పత్తులు నిల్వ చేసుకునే కోల్డ్ స్టోరేజీలకు రాష్ట్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ పథకాన్ని ప్రకటించింది. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన ఉత్పత్తుల నాణ్యత దెబ్బతినకుండా నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యేందుకు గాను 'కోల్డ్ చైన్' పేరిట ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. జిల్లాలో ప్రధానంగా మిర్చి నిల్వ చేసే కోల్డ్ స్టోరేజీలు 40 వరకు ఉండగా.. రైతులు, వ్యాపారులు మిర్చిని నిల్వ చేసి ధర మెరుగ్గా ఉన్న సమయంలో విక్రయిస్తుంటారు. అయితే, కొన్ని సందర్భాల్లో నిల్వ చేసిన మిర్చి నాణ్యత దెబ్బతింటోందనే విమర్శలు ఉన్నాయి. ఇందుకు ప్రధాన కారణం అవసరమైన మేరకు విద్యుత్ సరఫరా లేకపోవడాన్ని కారణంగా చెబుతుంటారు. దీంతో ఈ సమస్యను అధిగమించేందుకు ప్రవేశపెట్టిన పథకం కోసం కోల్డ్ స్టోరేజీల యజమానులు ఈనెల 18వ తేదీ నాటికి దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది.

35 శాతం రాయితీ

కోల్డ్ చైన్ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం 35 శాతం రాయితీ కల్పించింది. స్టోరేజీల్లో సామర్థ్యానికి అనుగుణంగా సోలార్ విద్యుత్ యూనిట్‌ను అమర్చుకోవచ్చు. ఈమేరకు రూ.35 లక్షల విలువైన యూనిట్‌లో 35 శాతం రాయితీని కల్పించగా.. బ్యాంకు నుంచి తీసుకునే రుణం ద్వారా ఈ రాయితీ వర్తిస్తుంది. ఇందుకోసం అవసరమైన పత్రాలతో యజమానులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆసక్తి ఉన్న యజమానులు వివరాల కోసం పాలేరు నియోజకవర్గంలో ఉద్యాన అధికారి పి.అపర్ణ(79977 25129), ఖమ్మం నియోజకవర్గంలో కె.మీనాక్షి (79977 25128), మధిర నియోజకవర్గంతో పాటు కల్లూరు, పెనుబల్లి, తల్లాడ మండలాల వారు జి.నగేష్(79977 25127), వైరా నియోజకవర్గం, సత్తుపల్లి, వేంసూరు మండలాల యజమానులు ఏ.వేణు(79977 25130)ను సంప్రదించాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి బీ.వీ.రమణ సూచించారు.

క్లుప్తంగా

108 పైలట్ల శిక్షణలో ప్రతిభ




ప్రశంసాపత్రాలు అందుకుంటున్న నరేష్, రామకృష్ణ

నేలకొండపల్లి/కూసుమంచి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగిన 108 పైలట్ల శిక్షణలో నేలకొండపల్లికి చెందిన పాలడుగు రామకృష్ణ, కూసుమంచి మండలం నాయకన్‌గూడెంకు చెందిన కోటగిరి నరేష్ ప్రతిభ చాటారు. గురువారం నిర్వహించిన శిక్షణలో వారు ప్రతిభ చాటి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈకార్యక్రమంలో 108 ఉమ్మడి జిల్లా మేనేజర్ భూమా నాగేందర్, ఉద్యోగులు ప్రణయ్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ రజిని

కూసుమంచి: మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి.రజిని కోరారు. పాలేరులోని శ్రీ పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా స్థానంలో 'ఆక్వా కల్చర్ ఉత్పత్తి – వ్యవస్థల్లో అధునాతన సాంకేతికత' అంశంపై ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ, భద్రాద్రి కొత్తగూడెం, కామారెడ్డి జిల్లాల మత్స్యకారులకు ఏర్పాటుచేసిన శిక్షణ గురువారం ప్రారంభమైంది. ఈసందర్భంగా రజిని మాట్లాడుతూ రాష్ట్రంలో మత్స్య ఉత్పత్తిని రెట్టింపుచేసి ప్రజలందరికీ చౌకగా పౌష్టికాహారం అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇందుకోసం మత్స్యకారులు శిక్షణను సద్విని యోగం చేసుకుంటూ ఆధునిక విధానాలు అవలంబించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ సీనియర్ సైంటిస్ట్ బి.లవకుమార్, శాస్త్రవేత్త రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

దుప్పి మాంసం విక్రేతలపై కేసు నమోదు

పెనుబల్లి: మండలంలోని చౌడవరంలో దుప్పి మాంసం విక్రయిస్తున్న వారిపై గురువారం కేసు నమోదైంది. గ్రామానికి చెందిన లింగనబోయిన నాగరాజు, టి.వెంకటేశ్వరరావు, డి.వెంకటేశ్వర్లు, ఎస్.శ్రీను, కె.బాలకృష్ణ దుప్పి మాంసాన్ని కె.కోటేశ్వరరావుకు అమ్మారానే సమాచారంతో అటవీ శాఖ అధికారులు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు ఇంట్లో మూడు కేజీల దుప్పి మాంసం, కరెంటు ఉచ్చులు లభించగా, స్వాధీనం చేసుకుని వేటగాళ్లపై కేసు నమోదు చేసినట్లు డీఆర్‌ఓ పిచ్చేశ్వరి తెలిపారు. తనిఖీల్లో అటవీ ఉద్యోగులు కోటేశ్వరి, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,045

లహరిలో.. లాహిరిలో...



రోడ్డెక్కిన ఆర్టీసీ స్లీపర్ బస్సులు

- రీజియన్‌కు పది సర్వీసుల కేటాయింపు
- ఖమ్మం నుంచి బెంగళూరుకు నాలుగు ఏసీ బస్సులు
- ఆదరణ లభిస్తోందంటున్న అధికారులు

సాక్షి, ఖమ్మం డెస్క్:

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి హైదరాబాద్, బెంగళూరుతో పాటు ఏపీ, ఛత్తీస్‌గఢ్‌లోని వివిధ ప్రాంతాలకు ప్రజలు, ఉద్యోగుల రాకపోకలకు ఎక్కువగా ఉంటాయి. చాలామంది రాత్రి వేళ బయలుదేరి ఉదయం కల్లా గమ్యస్థానానికి చేరుకుని పనులు చూసుకునేలా ప్రయాణ ప్రణాళిక రూపొందించుకుంటారు. అయితే, వీరిలో చాలా మంది స్లీపర్ కోచ్ బస్సులను ఎంచుకుంటుండగా.. ఆర్టీసీలో లభ్యత లేక ప్రైవేట్ ట్రావెల్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా ఖమ్మం మీదుగా రాత్రి వేళ రహదారులను పరిశీలిస్తే రయ్‌రయ్ మంటూ వచ్చివెళ్లే పెద్దసంఖ్యలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు కనిపిస్తాయి. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉండగా.. ఆర్టీసీ సైతం 'లహరి' పేరిట స్లీపర్ బస్సులను ఇటీవల ప్రవేశపెట్టింది.

ఖమ్మం రీజియన్‌కు పది బస్సులు

ఖమ్మం రీజియన్‌లో ఏడు డిపోలు ఉండగా.. ప్రస్తుతం ఖమ్మం, సత్తుపల్లి, మణుగూరు భద్రాచలం డిపోలకు కలిపి పది లహరి బస్సులు కేటాయించారు. దశల వారీగా కొత్తగూడెం, మధిర ఆపై ఇల్లెందు డిపోకు కూడా బస్సులు ఇచ్చే అవకాశముందని సమాచారం. ఇప్పుడు ఉన్న పది బస్సుల్లో ఖమ్మం డిపోకు నాలుగు ఏసీ బస్సులను కేటాయించగా.. భద్రాచలం, మణుగూరు, సత్తుపల్లి డిపోలకు రెండేసి చొప్పున నాన్ ఏసీ బస్సులు ఇచ్చారు.



అత్యాధునిక కుషన్‌తో రూపొందించిన బెర్తులు

ప్రత్యేకతలు ఇవే..

లహరి బస్సులను ప్రయాణికుల అవసరాలకు తగ్గట్లుగా అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దారు. ఏసీ, నాన్ ఏసీ బస్సుల్లో ప్రతీ సీట్ / బెర్త్‌కు రీడింగ్ ల్యాంప్, చార్జింగ్ సాకెట్లు ఏర్పాటుచేశారు. అంతేకాక బెర్తుల వద్ద యూఎస్‌బీ సాకెట్లు కూడా బిగించారు. ఇవేకాక వెహికల్ ట్రాకింగ్ సిస్టం, ఫైర్ డిటెక్షన్ అండ్ అలారం సిస్టమ్, సీసీ కెమెరా, స్పీకర్ అనౌన్స్‌మెంట్ సౌకర్యం కూడా ఉంది.

హైబ్రిడ్ రూపంలో...

ప్రైవేట్ పోటీ నుంచి తట్టుకోవడంతో పాటు దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం ఆర్టీసీ ఇటీవల లహరి స్లీపర్ కోచ్ బస్సులను ప్రవేశపెట్టింది. ఈ బస్సులను హైబ్రిడ్ రూపంలో తీసుకొచ్చారు. అంటే ఇందులో బెర్తులతో పాటు సీట్లు కూడా ఉంటాయి. వీటికి వేర్వేరు చార్జీలు నిర్ణయించగా.. ఇష్టమైనది ఎంచుకునే అవకాశముంది. అంతేకాక కొన్ని ఏసీ, మరికొన్ని నాన్ ఏసీ బస్సులు కావడంతో చార్జీల్లోనూ వ్యత్యాసం ఉంటోంది.



బస్సులో సీటింగ్

ఎక్కడెక్కడకు...

ఖమ్మానికి కేటాయించిన ఏసీ లహరి బస్సులను బెంగళూరుకు నడిపిస్తున్నారు. ఇక భద్రాచలం, మణుగూరు, సత్తుపల్లి డిపోల నుంచి ఆరు నాన్ ఏసీ బస్సులను హైదరాబాద్‌కు నడిపిస్తున్నారు. అన్ని బస్సులకు ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ సదుపాయం కల్పించారు. త్వరలో రీజియన్‌కు మరిన్ని బస్సులు రానుండగా.. విశాఖపట్నం తదితర ప్రాంతాలకు కూడా నడిపించే అవకాశముందని తెలుస్తోంది.

బస్సులకు మంచి ఆదరణ



లహరి బస్సుల్లో ప్రయాణం చాలా సౌకర్యవంతంగా ఉంటుంది. అత్యాధునికంగా బస్సును రూపొందించారు. దీంతో ప్రయాణికుల నుంచి బస్సులకు మంచి ఆదరణ లభిస్తోంది. రాత్రివేళ నడిపించే సర్వీసుల్లో బెర్తులకు బాగా డిమాండ్ ఉంది. సత్తుపల్లి డిపో నుంచి నడిచే బస్సుల్లో 70 శాతానికి పైగా ఓఆర్(ఆక్యుపెన్సీ రేషియో) నమోదవుతోంది.

– యు.రాజ్యలక్ష్మి, డిపో మేనేజర్, సత్తుపల్లి

గిరిజన రైతులకు విద్యుత్ సమస్యలు ఉండొద్దు

భద్రాచలం: భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లోని గిరిజన రైతులకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ అన్నారు. ఉమ్మడి జిల్లాలోని తహశీల్దార్‌లు, ఎంపీడీఓలు, విద్యుత్ ఏడీ, డీఈ, ఏఈ, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు పంపిణీ చేసిన రైతుల పొలాలకు విద్యుత్ సరఫరా తప్పనిసరి అని చెప్పారు. ఇందుకు అటవీ, విద్యుత్‌శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఇబ్బందులు ఉంటే రైతుల ద్వారా ఫారం-ఏ, బీలను సేకరించి తనకు సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఆర్‌ఓఎఫ్‌ఆర్ డీటీ శ్రీనివాస్, ఏపీఓ మునీర్ పాషా పాల్గొన్నారు.

రూ.8లక్షల రివార్డు ఉన్న మావోయిస్టు అరెస్టు

చర్ల: ఛత్తీస్‌గఢ్ పోలీసులు రూ.8 లక్షల రివార్డు కలిగిన మావోయిస్టును గురువారం పోలీసులు అరెస్టు చేశారు. బీజాపూర్ జిల్లాలోని బాసగూడ పోలీస్ స్టేషన్ పరిధి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో బలగాలు గురువారం కూంబింగ్ చేపట్టాయి. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని పట్టుకుని విచారించగా మావోయిస్టు పార్టీ మద్దేడు ఏరియా కమిటీ కమాండర్ సుధాకర్‌గా తేలడంతో అరెస్ట్ చేశారు. ఆయనపై రూ.8 లక్షల రివార్డుతో పాటు వివిధ పోలీస్ స్టేషన్లలో 108 అరెస్టు వారెంట్లు ఉన్నాయని, పలు జిల్లాల్లో జరిగిన విధ్వంసకర ఘటనల్లో పాల్గొన్నట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు.

ఆ చిన్నారికి రెండేళ్లకే నూరేళ్లు...

మురుగు కాల్వలో పడి మృత్యువాత



శేఖర్ (ఫైల్)

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 8వ డివిజన్ ఎల్‌బీ నగర్‌లో విషాదం చోటుచేసుకుంది. అప్పుడే వస్తున్న తన ముద్దుముద్దు మాటలతో తల్లిదండ్రులను అలరిస్తున్న రెండేళ్ల చిన్నారి గురువారం కాల్వలో పడి మృతి చెందాడు. అయితే, తమ ఇంటి ముందు డ్రెయినేజీ నిర్మాణం సక్రమంగా లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందంటూ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదించడం స్థానికులను కలిచివేసింది..

ఆడుకుంటూ వెళ్లి...

ఎల్‌బీ నగర్‌కు చెందిన భవానీ వీరస్వామి, సరోజిని దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఓ కుమార్తె, కుమారుడితో పాటు చిన్నవాడైన శేఖర్(2) సంతానం. వీరి ఇంటి ముందు డ్రెయినేజీ నిర్మాణం లేకపోవడంతో ఇళ్లలో వాడుతున్న మురుగునీరు చేరి గుంతగా మారింది. కాగా, రోజులాగా వీరస్వామి గురువారం కూలీ పనికి వెళ్లగా సరోజిని వంట పనుల్లో నిమగ్నమైంది. దీంతో శేఖర్ ఆడుకుంటూ బయటకు వెళ్లి ఇంటిముందు ఉన్న మురుగు నీటిలో పడ్డాడు. కాసేపయ్యాక శేఖర్ కనిపించకడంతో తల్లి వెతుకుతుండగా మురు గు నీటిలో బిడ్డ కనపడ్డాడు. దీంతో ఆమె స్థానికుల సాయంతో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. అయితే, ఇంటి ముందు డ్రెయిన్ నిర్మాణం చేపట్టపోవడంతోనే తమ కుమారుడు బలయ్యాడంటూ అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై వారు మండిపడ్డారు. ఘటనపై చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ భాను ప్రకాష్ తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న వ్యక్తికి తీవ్ర గాయాలు

తిరుమలయపాలెం: మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపాన ఖమ్మం నుండి వరంగల్ వైపు వెళ్తూ ఆగిన లారీని ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కూసుమంచి మండలం గైగొళ్లపల్లికి చెందిన పప్పుల కొండల్ గురువారం రాత్రి మోటార్‌సైకిల్‌పై పిండిప్రోలులోని బంధువుల ఇంటికి వెళ్తున్నాడు. ఈక్రమంలో తిరుమలాయపాలెం వద్ద రహదారిపై ఓ లారీ డ్రైవర్ లైట్లు రాకపోవడంతో పక్కన నిలిపాడు. ఆ వెనక నుంచి వెళ్తున్న కొండల్‌కు ఎదురుగా వస్తున్న వాహనం లైట్లు కళ్లలో పడి లారీ కనిపించకపోవడంతో బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆయనకు తలకు తీవ్ర గాయం కాగా పోలీసులు 108లో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే, ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తుండగా, లారీ డ్రైవర్ పరారయ్యాడని పోలీసులు తెలిపారు.

కిడ్నాప్ కేసు నమోదు

నేలకొండపల్లి: మండలానికి చెందిన ఓ యువతిని కిడ్నాప్ చేసిన ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. శంకరగిరితండా గ్రామానికి చెందిన యువతిని అదే గ్రామానికి చెందిన యువకుడు కిడ్నాప్ చేసినట్లు ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.నాగరాజు తెలిపారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు రశీదు అందజేస్తున్న ఉద్యోగులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు చెందిన భక్తులు గురువారం విరాళం అందజేశారు. ఖమ్మంకు చెందిన కల్వకుంట్ల గోపాలరావు దంపతులు రూ.లక్ష, కొత్తగూడెం విద్యానగర్‌కు చెందిన వనం సుధాకర్–మల్లిక కామాక్షి దంపతులు రూ.లక్ష చెక్కును ఆలయ అధికారులకు అందజేశాక, స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే, దాతలకు ఆలయ ఉద్యోగులు స్వామివారి ప్రసాదంతోపాటు జ్ఞాపిక అందజేశారు.

25న స్వర్ణలక్ష్మి పూజ

శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలోని శ్రీలక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో ఈనెల 25న శ్రీస్వర్ణలక్ష్మీ పూజ నిర్వహించనున్నట్లు ఈఓ రమాదేవి తెలిపారు. పూజలో పాల్గొనే భక్తులు రూ.600 చెల్లించాలని, వారికి పూజా సామగ్రితో పాటు అమ్మవారి వెండి ప్రతిమ, ప్రసాదం ఇస్తామని పేర్కొన్నారు. కాగా, 25న హోలీ రోజు రామయ్యను పెండ్లి కుమారుడిని చేసే కార్యక్రమం ఉండడంతో నిత్యకల్యాణాన్ని రద్దు చేసినట్లు ఈఓ తెలిపారు.

18 రోజుల ముందుగానే లక్ష్య సాధన

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియాలో ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన 129.50 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని 18 రోజుల ముందుగానే (ఈనెల 13న) 129.74 లక్షల టన్నులు సాధించింది. ఈ సందర్భంగా ఏరియా జీఎం శాలేంరాజు గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. సింగరేణి వ్యాప్తంగా కొత్తగూడెం ఏరియా ఉత్పత్తిలో అగ్రస్థానంలో నిలిచిందని చెప్పారు. ఒకటి, రెండుసార్లు మినహా ప్రతీ నెలలోనూ కొత్తగూడెం ఏరియా ఉత్పత్తి లక్ష్యాలను సాధించిందని వివరించారు. ఇందుకు సహకరించిన అధికారులు, కార్మికులు, కార్మిక సంఘాలకు ధన్యవాదాలు తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు.

గాలికుంటు కట్టడికి కార్యాచరణ

- నివారణకు టీకాలే మార్గం
- నేటి నుంచి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు
- ఉమ్మడి జిల్లాలో 7లక్షల మేర పశువులు



గాలికుంటు వ్యాధి సోకిన పశువుకు చికిత్స చేస్తున్న వైద్యులు

ఖమ్మంవ్యవసాయం: పశువులను తరచూ ఇబ్బందులకు గురిచేసే వ్యాధుల్లో ప్రధానమైనది గాలికుంటు వ్యాధి. పశువులను ఈ వ్యాధి నుంచి రక్షించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా టీకాలు వేయించనుంది. ఈనెల 15వ తేదీ నుంచి నెల రోజుల టు ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యాన పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. ఉమ్మడి జిల్లాలో గేదెలు) సుమారు 4.10 లక్షల వరకు ఉండగా, తెల్ల పశువులు 2.90 లక్షలు ఉన్నట్లు అంచనా.

గాలి ద్వారా వ్యాప్తి

అతి సూక్ష్మాతి సూక్ష్మమైన క్రిముల వల్ల పశువులకు గాలికుంటు వ్యాధి సోకుతుంది. పశువుల నోరు, గెట్టలు మధ్య పుండ్లు ఏర్పడి గాలి ద్వారా వ్యాపిస్తుంది. అందుకే దీన్ని గాలికుంటు వ్యాధి అంటారు. వ్యాధి సోకిన ఆవులు, గేదెల నుండి పాల ద్వారా దూడలకు సైతం వ్యాపిస్తుంది. కాగా, దేశవాళి పశువులతో పోలిస్తే వ్యాధి తీవ్రత సంకరజాతి పశువుల్లో అధికంగా ఉంటుంది. కాగా, వ్యాధి సోకిన పశువుల్లో జ్వరం తీవ్రత 105 డిగ్రీలకు పైగా ఉంటుంది. నోరు, నాలిక పైభాగంలో పుండ్లు ఏర్పడుతాయి. అంతేకాక పశువులు మేత మేయకపోగా, నెమర వేసేందుకు ఇబ్బంది పడుతాయి. రోజు కంటే పాల దిగుబడి తగ్గి, నిరంతరం కళ్ల నుంచి నీరు కారుతుంది. అలాగే, నోటినుంచి నురుగుతో పాటు సొంగ వస్తుంది. చికిత్సపై నిర్లక్ష్యం చేస్తే పశువులు చనిపోయే ప్రమాదం కూడా ఉంటుంది.

చికిత్సా విధానం ఇలా..

వ్యాధికి గురైన పశువులకు సరైన సమయంలో చికిత్స చేయిస్తే రక్షించుకోవచ్చు. తొలుత వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి. పశువుల పాకలను క్రిమిసంహారక మందులు, బట్టలసోడాలతో శుభ్రం చేయాలి. ఒకవేళ పశువులు మరణిస్తే సున్నపు గోతిలో పూడ్చివేయాలి. వ్యాధి బారిన పశువుల పాలను దూడలకు తాగించొద్దు. అలాగే, పశువుల గిట్టల మధ్య పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో కడిగి ఈగలు వాలకుండా వేపనూనె పూయాలి. నోటిలో పుండ్లకు బోరిక్ పౌడర్, గ్లిసరిన్ కలిపి పూయాలి. గడ్డిమేయని వాటికి ఉప్పు, బెల్లం, గ్లూకోజు కలిపిన గంజిని తాగించాలి. లేదంటే లీటర్ చొప్పున రోజుకు రెండుసార్లు అంబలి తాగించాలి.

మూడు నెలలు పైబడిన పశువులకు టీకాలు



మూడు నెలల పైబడిన ప్రతీ పశువుకు విధిగా టీకా వేయించాలి. టీకాలు వేస్తే పాల దిగుబడి తగ్గుతుందని, ఈడుసుకుపోతాయని భావిస్తున్నారు. ఇలాంటి అపోహలను విడనాడి పశువులకు టీకాలు వేయించాలి. ప్రతీ పశువైద్యశాలలో ఉచితంగా టీకాలు వేయనున్నందున రైతులు వినియోగించుకోవాలి.

– డాక్టర్ అరుణ, ఖమ్మం పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఏడీ

గాయపడిన చుక్కల దుప్పి



దుప్పికి చికిత్స చేస్తున్న సిబ్బంది

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి అర్బన్ పార్క్‌లోని ఓ చుక్కల దుప్పి గురువారం ప్రమాదవశాత్తు గాయపడింది. పార్కులో సంచరిస్తున్న దుప్పి కాల్వలో పడగా గాయాలయ్యాయి. దీంతో అటవీశాఖ సిబ్బంది స్థానిక పశువైద్యశాలకు తరలించి చికిత్స చేయించాక పార్క్‌లో వదిలేశారు.

ఇసుక రవాణా కేసులో కస్టడీకి...

ఖమ్మంక్రైం: ఇసుక అక్రమ రవాణా కేసులో ఇటీవల పోలీసులు అరెస్ట్ చేసిన జిల్లా వాసి బోయపాటి వాసును విచారణ నిమిత్తం కస్టడీలోకి తీసుకున్నారు. ఖమ్మం బైపాస్‌రోడ్డులో చేపట్టిన తనిఖీల్లో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న లారీలు పట్టుబడ్డాయి. దీంతో వాసు సహా ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి జిల్లా జైలులో రిమాండ్ చేశారు. ఇందులో వాసును విచారణ నిమిత్తం గురువారం కస్టడీకి తీసుకున్నట్లు ఖమ్మం టూ టౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో క్లీనర్ మృతి

ముదిగొండ: తమిళనాడు రాష్ట్రానికి చెందిన లారీ క్లీనర్ అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. ముదిగొండ సమీపాన గురువారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ముదిగొండ- న్యూలక్ష్మీపురం ప్రధాన రహదారికి పక్కనే లారీ క్లీనర్ మహ్మద్ సలీం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్‌ఐ నరేష్ చేరుకుని వివరాలు సేకరించారు. ఆయన మృతికి కారణాలు తెలియరాకపోగా, మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

మధిరలో చోరీలు

మధిర: మధిరలో ఇటీవల వరుస చోరీలు జరుగుతున్నాయి. ఈక్రమంలోనే బుధవారం రాత్రి ఒకరి ఇంట్లోనే కాక షాపులో గుర్తుతెలియని వ్యక్తులు బంగారం, నగదు చోరీ చేశారు. పట్టణంలోని సుందరయ్య నగర్‌కు చెందిన బలగం మహేష్ ఇంట్లో మరమ్మతులు చేయిస్తుండగా ఇంకో ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. దీంతో ఆయన ఇంట్లోకి బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి 40 గ్రాముల బంగారం, రూ.50 వేలు నగదు అపహరించారు. అలాగే, అంబేద్కర్ సెంటర్‌లోని ఒక మెడికల్ షాపులోనూ రూ.50 వేలు నగదు ఎత్తుకెళ్లారు. ఈ రెండు దొంగతనాలు ఒకే ముఠా చేసినట్లు తెలుస్తుండగా, టౌన్ ఎస్‌ఐ సంధ్య గురువారం ఉదయం పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య



చిట్టిబాబు (ఫైల్)

వైరారూరల్: కుటుంబ కలహాల కారణంగా ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వైరా గన్నవరానికి చెందిన ఇలారపు చిట్టిబాబు(26) రెండేళ్ల క్రితం ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం కొణిజర్లకు చెందిన యువతితో వివాహం జరిగింది. ఆతర్వాత దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో పెద్ద మనుషుల సమక్షాన పంచాయతీలు నిర్వహించారు. కొద్దిరోజుల ఇద్దరు విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకోవడంతో యువతి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మనస్థాపానికి గురవుతున్న చిట్టిబాబు గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతరం గుర్తించిన కుటుంబీకులు ఇచ్చిన సమాచారంతో ఎస్సై ఏ.వంశీకృష్ణ భాగ్యరాజ్ వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ఇన్సూరెన్స్ స్కీమ్ అమలు

- ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున
- బ్యాంక్ లింకేజీ ప్రోగ్రాం కింద సభ్యులకు క్రెడిట్ లింక్డ్ రిస్క్ కవరేజీ వర్తింపు
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 64.35 లక్షల మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు (గ్రామీణ, పట్టణ) ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీమ్‌ను అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రమాదవశాత్తూ ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు మరణించిన పక్షంలో ఈ ప్రమాద బీమా వర్తించేలా చర్యలు చేపట్టనున్నారు. ఈ ఇన్సూరెన్స్ స్కీమ్ గురువారం నుంచే అమల్లోకి రానున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు ఈ పథకాన్ని పేరొందిన ఇన్సురెన్స్ సంస్థ ద్వారా (తక్కువ ప్రీమియం ఉండేలా) అమలు చేయాల్సిందిగా స్త్రీనిధి ఎండీని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పంచాయతీ రాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీచేశారు.

లోన్ బీమా కూడా వర్తింపు

అదేవిధంగా బ్యాంక్ లింకేజీ ప్రోగ్రాం కింద 64.35 లక్షల ఎస్‌హెచ్‌జీ సభ్యులకు (గ్రామీణ, పట్టణ) క్రెడిట్ లింక్డ్ రిస్క్ కవరేజీ (లోన్ బీమా)ని వర్తింపజేస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. రుణాలు తీసుకున్న సభ్యుల్లో ఎవరైనా చనిపోతే గరిష్టంగా రూ.2 లక్షల వరకు రిస్క్ కవరేజీ ఇచ్చేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ పథకం కూడా గురువారం నుంచి అమల్లోకి వచ్చినట్టు ప్రకటించారు. ఈ మేరకు పీఆర్ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా విడిగా ఉత్తర్వులు జారీచేశారు.

కొత్త బాసు రాకముందే
ఖాళీ చేయాలని..!

ట్యాపింగ్ ఆధారాలను ధ్వంసం చేసే కుట్ర చేసిన ఎస్ఐబీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు

- ఎన్నికల ఫలితాలు రావడంతో డిసెంబర్ 4న రాజీనామా
- అదే రోజు రాత్రి ప్రణీత్‌రావును ఎస్ఐబీకి పంపిన వైనం
- ట్యాపింగ్ కేసులో దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు
- త్వరలో ప్రభాకర్‌రావు సహా మరికొందరికి నోటీసులు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్ పార్టీ ఓడిపోవడం... ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ) హోదాలో అప్పటివరకు స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరోకు (ఎస్ఐబీ) నేతృత్వం వహించిన టి.ప్రభాకర్‌రావు రాజీనామా చేయడం ... త్వరలో ఆ విభాగానికి మరో బాస్ వచ్చే అవకాశం ఉండటం... ఈ పరిణామాల నేపథ్యంలోనే గత డిసెంబర్ 4న రాత్రే ఎస్ఐబీ ఆఫీస్‌లోని 'వార్ రూమ్'ను మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు ధ్వంసం చేసినట్లు అధికారులు గుర్తించారు. ప్రణీత్‌ను బుధవారం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించిన పంజగుట్ట పోలీసులు తదుపరి విచారణ కోసం కస్టడీకి కోరుతూ గురువారం నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను వెనక్కు ఇచ్చిన న్యాయస్థానం అదనపు పత్రాలతో శుక్రవారం మళ్లీ దాఖలు చేయాలని ఆదేశించింది.

డీఎస్పీగా చేరి ఓఎస్డీగా రాజీనామా...

1991లో డీఎస్పీగా పోలీసు విభాగంలో అడుగుపెట్టిన టి.ప్రభాకర్‌రావు 2001లో ఐపీఎస్ హోదా పొంది ఐజీగా పనిచేస్తూ 2020 జూన్‌లో పదవీ విరమణ పొందారు. అదే ఏడాది నవంబర్ 3న ప్రభాకర్‌రావును ఓఎస్డీ హోదాలో ఎస్ఐబీలో నియమించారు. అప్పట్లో నిఘా విభాగానికి నేతృత్వం వహించిన నవీన్ చంద్ పదవీ విరమణ చేయడంతో తాత్కాలికంగా ఆ బాధ్యతల్నీ ప్రభాకర్‌రావుకే అప్పగించారు. అప్పటి నుంచే ఈ అక్రమ ట్యాపింగ్ వ్యవహారాలకు బీజం పడిందని అనుమానిస్తున్నారు. నిఘా విభాగానికి అనిల్ కుమార్‌ను బాస్‌గా నియమించిన అప్పటి ప్రభుత్వం ప్రభాకర్‌రావును ఎస్ఐబీకి పరిమితం చేసింది. అప్పటి నుంచి ఎక్స్‌టెన్షన్‌పై కొనసాగుతూ వచ్చిన ప్రభాకర్‌రావు గత డిసెంబర్ 4న రాజీనామా చేశారు.

ఒకట్రెండు రోజుల్లో ఎస్ఐబీకి మరో అధికారిని నియమించే అవకాశం ఉండటంతో తమకు ఇబ్బంది లేకుండా, తక్షణం ట్యాపింగ్‌కు సంబంధించిన ఆధారాలు చెరిపేయాలని ప్రణీత్ రావుకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో వార్ రూమ్‌లు ఖాళీ చేసి, ట్యాపింగ్ ఆధారాలు ధ్వంసం చేయడానికి ఇతడు సిద్ధమైనట్లు పోలీసులు చెప్తున్నారు.

హార్డ్‌డిస్క్‌ల్ని కట్టర్లతో కట్ చేశారు

ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ప్రణీత్ ఓ ఎలక్ట్రీషియన్‌తో కలిసి ఎస్ఐబీ కార్యాలయంలోకి వెళ్లాడు. అక్కడ వార్ రూమ్‌తోపాటు అధికారిక ట్యాపింగ్స్ జరిగే లాగర్ రూమ్ దగ్గర సీసీ కెమెరాలను ఆఫ్ చేయించాడు. 17 కంప్యూటర్లలో ఉన్న వాటితోపాటు విడిగా భద్రపరిచిన 50 హార్డ్‌డిస్క్‌ల్నీ ధ్వంసం చేయడానికి ఉపక్రమించాడు. ఎలక్ట్రీషియన్ తోపాటు నమ్మినబంటుగా ఉన్న ఓ పోలీసు సహాయంతో ఎలక్ట్రిక్ కట్టర్ వినియోగించి ఈ హార్డ్‌డిస్క్‌లు ధ్వంసం చేశాడు. ఎస్ఐబీ అనునిత్యం మావోయిస్టులకు సంబంధించిన సమాచారం సేకరిస్తూ, వారిపై నిఘా ఉంచుతుంది. ఈ నేపథ్యంలోనే మావోయిస్టుల తోపాటు వారి సానుభూతిపరులు, వారితో వివిధ రకాలైన సంబంధాలు కలిగిన వారి వివరాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ నిక్షిప్తం చేస్తుంటుంది. ఎస్ఐబీ దృష్టిలో ఇది అత్యంత విలువైన డేటా. ప్రణీత్ ధ్వంసం చేసిన హార్డ్‌డిస్క్‌ల్లో ఈ డేటా ఉందని, ఇప్పుడు దాన్ని తిరిగి పొందటం సాధ్యం కాదని అధికారులు చెప్తున్నారు. ఆ కోణంలోనూ ప్రణీత్‌ను విచారించనున్నారు. ప్రణీత్‌ను పోలీసు కస్టడీలోకి తీసుకుని విచారించిన తర్వాత ప్రభాకర్‌రావు సహా మరికొందరికి నోటీసులు జారీ చేయాలని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.

రైతులు, నిరుద్యోగుల
ఆస్తులు తాకట్టు పెట్టుకోవద్దు

- బ్యాంకర్లకు డిప్యూటీ సీఎం భట్టి సూచన
- రైతుల విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించండి
- ఎస్‌హెచ్‌జీల మహిళలకు ఎక్కువ రుణాలివ్వండి
- మంత్రి తుమ్మలతో కలిసి ఎస్ఎల్‌బీసీ భేటీకి హాజరు



సాక్షి, హైదరాబాద్: రైతులు, నిరుద్యోగులకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకర్లు వారి ఆస్తులను తాకట్టు పెట్టుకోవడం సరైంది కాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రైతుల విషయంలో బ్యాంకులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా బ్యాంకర్లు వారికి ఎక్కువ రుణాలు ఇవ్వాలని కోరారు. స్వయం ఉపాధి కోసం యువతకు కూడా రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గురువారం బేగంపేటలోని ఒక ప్రైవేట్ హోటల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్‌బీసీ) 40వ త్రైమాసిక సమావేశానికి వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి భట్టి హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్యాంకర్లను ఉద్దేశించి మాట్లాడారు.

రుణ వితరణ సామాజిక బాధ్యతగా గుర్తించాలి

రుణాలు ఇవ్వడం సామాజిక బాధ్యతగా బ్యాంకర్లు గుర్తించాలని భట్టి విజ్ఞప్తి చేశారు. సంపద సృష్టికర్తలకు బ్యాంకర్లు తోడ్పాటు ఇవ్వడం వల్ల సంపదను ప్రజలకు పంచవచ్చని వివరించారు. రైతులకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అసహనం ప్రదర్శిస్తే వారు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి రుణ భారం తీరక ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గత పాలనలో లావాదేవీలు జరగని ఖాతాలకు సంబంధించిన రైతులకు మళ్లీ రుణాలు ఇవ్వాలని చెప్పారు. రానున్న ఐదేళ్లలో డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.లక్ష కోట్ల వడ్డీ రహిత రుణాలు అందించాలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. వ్యాపారంలో విఫలమైన ఈము రైతులకు రుణాల చెల్లింపుల విషయంలో వన్ టైం సెటిల్మెంట్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. తాను ఆంధ్రా బ్యాంకు డైరెక్టర్‌గా ఉన్న సమయంలో విద్య రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు ప్రారంభం అయ్యాయని, 20 ఏళ్లు అవుతున్నా ఆ రుణాల జారీలో ప్రగతి కనిపించడం లేదని అన్నారు.

ప్రభుత్వ పథకాలకు సహకరించండి: తుమ్మల

ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల్లో ప్రజా ప్రాధాన్యత ఉన్న వాటిని గుర్తించి వాటిని ముందుకు తీసుకెళ్లడానికి బ్యాంకర్లు సహకరించాలని మంత్రి తుమ్మల కోరారు. రుణాలు ఇచ్చే విషయంలో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పాడి పరిశ్రమలు నెలకొల్పడానికి ముందుకు వచ్చే రైతులకు బ్యాంకర్లు రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా పట్టు గూళ్ల పెంపకం రైతులకు రూ.1.83 కోట్ల ప్రోత్సాహక చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎస్‌బీఐ సీజీఎం రాజేష్‌కుమార్, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ మిత్ర, నాబార్డ్ జీఎం పీపీ ఉషా తదితరులు పాల్గొన్నారు.

రూ. 49,501 కోట్ల పంట రుణాలు: ఎస్ఎల్‌బీసీ

రాష్ట్రంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో రైతులకు రూ.49,501 కోట్ల పంట రుణాలు ఇచ్చినట్లు ఎస్ఎల్‌బీసీ వెల్లడించింది. లక్ష్యంలో 67.41 శాతం చేరుకున్నట్లు గురువారం విడుదల చేసిన నివేదికలో తెలిపింది. రూ.624 కోట్ల మేర విద్యా రుణాలు, రూ.2,890 కోట్ల గృహ రుణాలు ఇచ్చినట్లు తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు రూ.7,55,800 కోట్లకు చేరాయని వివరించింది.

సింగరేణిలో సేఫ్టీ 'నోమ్'

- భూగర్భ గనుల్లో ప్రమాదాల నివారణకు ఆస్ట్రేలియా టెక్నాలజీ వినియోగం
- ప్రయోగాత్మకంగా ఒక గనిలో అమలుకు అంగీకారం
- వివరాలు వెల్లడించిన సింగరేణి సీఎండీ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భూగర్భ గనులను నూరుశాతం ప్రమాదరహితంగా మార్చేందుకు 'సింగరేణి' అంతర్జాతీయస్థాయి ఆధునిక సాంకేతికతను పరిశీలిస్తోందని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ తెలిపారు. భూగర్భగనుల్లో పైకప్పు కూలి జరిగే ప్రమాదాలను నివారించడానికి ఆస్ట్రేలియాకు చెందిన నోమ్ అనే సంస్థ కొత్తగా రూపొందించిన ఆధునిక పరికరాల పనితీరును హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం సంస్థ ఉన్నతస్థాయి అధికారులతో చర్చించారు. భూగర్భగనుల్లో రక్షణ చర్యలెన్ని తీసుకుంటున్నా, అకస్మాత్తుగా పైకప్పు కూలి కార్మికులు మృతి చెందిన ఘటనలు గతంలో అనేకం జరిగాయని ఈ సమావేశంలో అధికారులు అభిప్రాయపడ్డారు.



ఆస్ట్రేలియాకు చెందిన నోమ్ సంస్థ రూపొందించిన యంత్రం పనితీరును తెలుసుకుంటున్న సింగరేణి సీఎండీ ఎన్ బలరాం

నోమ్ సంస్థ రూపొందించిన పరికరం గనిలో పైకప్పు ప్రమాదం జరగకముందే ఫ్లాష్ లైటింగ్, సైరన్‌ల ద్వారా అక్కడ పనిచేస్తున్న కార్మికులు, అధికారులను హెచ్చరించి అప్రమత్తం చేస్తుందని, దీంతో ప్రమాదం నివారించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకొని, ప్రాణనష్టం జరగకుండా చూసే అవకాశం ఏర్పడుతుందని అన్నారు. ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏదైనా ఒక భూగర్భగనిలో వినియోగిస్తామని, అక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా తదుపరి నిర్ణయం తీసుకుంటామని సీఎండీ వెల్లడించారు. ఈ సమావేశంలో డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ జి.వెంకటేశ్వర్ రెడ్డి, జనరల్ మేనేజర్ (ఆర్‌అండ్‌డీ) సుభాని తదితరులు పాల్గొన్నారు. కాగా నోమ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నాథన్‌టవెన్, జనరల్ మేనేజర్ కేసస్‌ఫిన్‌లెన్ డెమోస్ట్రేషన్ ద్వారా యంత్రం పనితీరు గురించి అధికారులకు వివరించారు.

ఆ విలేకరులను క్షమించేది లేదు
– టీయూడబ్ల్యూజే, ఐజేయూ

సాక్షి, హైదరాబాద్: గొలుసు కట్టు మనీ స్కీమ్‌కు ఒక కుటుంబం బలైన దుర్ఘటనలో కొంతమంది విలేకరుల పాత్ర ఉండటం అత్యంత విచారకరమని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే), ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) పేర్కొన్నాయి. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని టంగుటూరు గ్రామంలో జరిగిన ఘటన మీడియాలోని ప్రతి ఒక్కరూ తలదించుకునేలా చేసిందని ఆ సంఘాలు విచారం వ్యక్తం చేశాయి. మీడియా ప్రమాణాలను, గౌరవాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీయూడబ్ల్యూజే, ఐజేయూ గురువారం విడుదల చేసిన ప్రకటనలో విజ్ఞప్తి చేశాయి. వాస్తవాలను రాయకుండా ఉండడానికి ఒక వ్యక్తి వద్ద డబ్బులు డిమాండ్ చేసిన విలేకరులు వృత్తికి ద్రోహం చేయడమే గాకుండా ఆ క్రమంలో నలుగురి ప్రాణాలు పోవడానికి కారకులయ్యారని టీయూడబ్ల్యూజే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగునూరి శేఖర్, కె.విరాహత్ అలీ, ఐజేయూ కార్యదర్శి వై నరేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లా వార్తలు

రైతాంగాన్ని విస్మరిస్తే పతనం తప్పదు

సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యాన కేంద్రం దిష్టిబొమ్మ దహనం



నిరసన తెలుపుతున్న రైతు సంఘాల నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: రైతాంగాన్ని విస్మరించిన వారికి పతనం తప్పదని గతంలో పలుమార్లు రుజువైందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు భాగం హేమంతరావు తెలిపారు. కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం జేబుసంస్థగా మారి అన్నదాతలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యాన గురువారం ఖమ్మం పాతబస్టాండ్ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ ను దహనం చేశారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ మూడేళ్లుగా మద్దతు ధర కోసం రైతులు పోరాడుతుంటే పట్టించుకోకపోగా, తూటాలు గురిపెడుతున్నారని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేలా నూతన సాగు చట్టాలను తీసుకురాగా, ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, సీపీఐ నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, పోటు ప్రసాద్, దొండపాటి రమేష్, అడసా రామకోటయ్య, మిడికంటి వెంకటరెడ్డి, రాంబాబు, మాదినేని రమేష్, ఆవుల వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్, జమ్ముల జితేందర్‌రెడ్డి, శింగు నర్సింహారావు, ఏపూరి లతాదేవి, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, సీహెచ్.సీతామహాలక్ష్మి, మేకల శ్రీనివాసరావు, రావి శివరామకృష్ణ పాల్గొన్నారు.

చర్లపల్లిలో హాల్టింగ్

ఖమ్మం మామిళ్లగూడెం: కొన్నాళ్లుగా ప్రయాణికుల నుంచి వస్తున్న వినతుల మేరకు పలు సూపర్‌ఫాస్ట్ రైళ్లకు చర్లపల్లిలో హాల్టింగ్ ఇచ్చారు. ఈ విషయాన్ని ఖమ్మం సీసీఐ ఎం.డీ. జాఫర్ ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ–సికింద్రాబాద్(12713), సికింద్రాబాద్– విజయవాడ(12714) శాతవాహన సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌తోపాటు సికింద్రాబాద్–గుంటూరు (12706), గుంటూరు–సికింద్రాబాద్ (12705) ఇంటర్‌సిటీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు గురువారం నుంచి చర్లపల్లిలో ఆగుతాయని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వెంటాడుతున్న కష్టాలు

మామిడి రైతులకు వరుస నష్టాలు

- కొన్నేళ్లుగా అనుకూలించని వాతావరణం
- ఈ ఏడాది కూడా అదే పరిస్థితి
- చిగురుగా మారిన పూత.. కనిపించని కాత
- ఉమ్మడి జిల్లాలో 53వేల ఎకరాల్లో మామిడి తోటలు



రొంపేడులోని మామిడి తోటలో కనిపించని పూత



పూత స్థానంలో కనిపిస్తున్న లేత ఆకులు

ఇల్లెందురూరల్: ఈ ఏడాది కూడా మామిడి రైతులకు కాలం కలసిరాలేదు. ఖరీఫ్ చివరలో కురిసిన వర్షాలకు తోడు నిషాన్ తుఫాన్ ప్రభావం.. వాతావరణంలో వచ్చిన మార్పులు రైతులకు శాపంగా మారాయి. ఈ అంశాలన్నీ మామిడి పూత, పిందెలపై తీవ్ర ప్రభావం చూపాయి. ఫలితంగా మునుపెన్నడూ లేనంతగా ఈసారి మామిడి దిగుబడి తగ్గుముఖం పట్టే అవకాశముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

2020 నుంచి అదే పరిస్థితి..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మామిడి తోటలు సుమారు 53వేల ఎకరాల్లో ఉన్నాయి. భద్రాద్రి జిల్లాలో 11వేల ఎకరాల్లో, ఖమ్మం జిల్లాలో 42వేల ఎకరాల్లో ఈ తోటలు సాగవుతున్నట్లు అధికారిక అంచనా. భద్రాద్రి జిల్లాలో అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి, టేకులపల్లి, ఇల్లెందు, అశ్వారావుపేట మండలాల్లో, ఖమ్మం జిల్లాలో ఎర్రుపాలెం, తల్లాడ, పెనుబల్లి, వేంసూరు, కల్లూరు, కామేపల్లి, సత్తుపల్లి మండలాల్లో మామిడి తోటలు ఉన్నాయి. అయితే, వరుసగా ఐదేళ్ల నుంచి మామిడి రైతులకు నష్టాలే ఎదురవుతున్నాయి. 2020లో భారీ వర్షాల కారణంగా పూత, పిందె పూర్తిగా రాలిపోయాయి. 2021, 22 సంవత్సరాల్లో కరోనా ప్రభావంతో విక్రయాలు లేక ధరపై ప్రభావం చూపింది. ఫలితంగా కాత కాస్త ఆశాజనకంగా ఉన్నా ధర లేక రైతులు నష్టాలను మూటగట్టుకున్నారు. ఇక గతేడాది పూత, కాత సంతృప్తిగా ఉండడంతో దిగుబడిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులకు నల్లి రూపంలో నష్టం ఎదురైంది. ప్రస్తుతం చిక్కగా వచ్చిన పూత వాతావరణం అనుకూలించక చివరకు చిగురుగా మారింది. దీంతో దిగుబడి ప్రారంభంలోనే రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది.

ప్రతికూల వాతావరణమే..

గతేడాది కాత దశలో నల్లి సోకినా దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో ఈసారి కూడా అదే స్థాయిలో దిగుబడి వస్తుందని రైతులు ఆశించారు. కానీ పూత దశలోనే వారి ఆశలు అడియాసలయ్యాయి. గతేడాది చివరలో కురిసిన వర్షాలకు తోడు నిషాన్ తుఫాన్ మామిడి తోటలపై ప్రభావం చూపాయి. పూతకు కీలకమైన సమయాల్లో చోటుచేసుకున్న పరిణామాలు, చీడపీడల ప్రభావం మామిడి రైతుకు శాపంగా మారాయి. ఈ కారణంగా ప్రస్తుతం పూసిన పూత చిగురుగా మారడంతో ఎక్కువ చోట్ల కాత కనిపించకుండా పోయింది. ప్రధానంగా ముదురు తోటల్లో ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని రైతులు చెబుతున్నారు.

కౌలు రైతుల గగ్గోలు

మామిడి రైతులు అత్యధికంగా పూత దశలోనే తోటలను వ్యాపారులకు కౌలు ఇవ్వడం ఆనవాయితీ. పూత దశలో తోటలను పరిశీలించి కౌలు ధర నిర్ణయిస్తారు. ఇందులో ముందుగా కొంత.. పంట చేతికందాక మిగతా సొమ్ము చెల్లిస్తారు. ఇదే తరహాలో ఈసారి కూడా కౌలు రైతులు మామిడి తోటలు తీసుకున్నారు. గతేడాది నల్లి మినహా మామిడి దిగుబడి ఆశాజనకంగా ఉండటంతో ఈసారి కౌలు రైతులు ఆసక్తి కనబరిచారు. కానీ తోటల్లో కాత నామమాత్రంగా కూడా కనిపించకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

ప్రయత్నాలన్నీ వృథా



గతేడాది డిసెంబర్ నుంచి పూత మొదలు కాగా, జనవరిలో పూతతో చూసి కాత ఆశాజనకంగా ఉంటుందని అనుకున్నాం. కానీ పూత క్రమంగా చిగురుగా మారగా, కాపాడుకునేందుకు చేసిన ప్రయత్నాలన్నీ వృథా అయ్యాయి.

– మంచె కృష్ణయ్య, కొమరారం, ఇల్లెందు మండలం

మామిడి కలసి రావడం లేదు..



గడిచిన ఐదేళ్లుగా మామిడి పంట కలిసి రావడం లేదు. అతివృష్టి, అనావృష్టి, చీడపీడలు ఏదో ఓ రూపంలో నష్టాలు ఎదురవుతున్నాయి. ఈ ఏడాది పూత బాగానే ఉన్నా తుఫాన్, చలి ప్రభావంతో చిక్కని పూత చిగురుగా మారింది.

–తోకల జానయ్య, కొమరారం, ఇల్లెందు మండలం

నేటి నుంచి మళ్లీ తునికాకు టెండర్లు

- మూడు సార్లు పిలిచినా కొన్ని యూనిట్లే అమ్మకం
- మూడు జిల్లాల్లో ఇంకా 26 యూనిట్లు



సేకరణకు సిద్ధం ఉన్న తునికాకు

పాల్వంచరూరల్: ఈ ఏడాది తునికాకు సేకరణ కోసం తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చేస్తున్న ప్రయత్నాలు పెద్దగా ఫలించడం లేదు. ఇప్పటివరకు మూడు సార్లు ఆన్‌లైన్‌లో టెండర్లు నిర్వహించినా ఉమ్మడి ఖమ్మంతో పాటు మహబూబాబాద్ జిల్లాలోని మొత్తం యూనిట్లు అమ్ముడవలేదు. దీంతో నాలుగో దఫా నేటి నుంచి 19వ తేదీ వరకు టెండర్ల ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మూడు జిల్లాల పరిధిలో ఈ ఏడాది 35,100 స్టాండర్డ్ బ్యాగ్‌ల తునికాకు సేకరించాలనేది అధికారుల లక్ష్యం. అయితే, మూడు దఫాలుగా ఆన్‌లైన్‌లో టెండర్లు నిర్వహించినా ఫలితం లేకపోవడంతో నాలుగో దఫా టెండర్లకు సిద్ధమయ్యారు. కాగా, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని 10 డివిజన్ల పరిధిలో 51యూనిట్లు ఉండగా 25యూనిట్లలో తునికాకు సేకరణను కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. భద్రాచలం డివిజన్‌లోని ఐదు యూనిట్లలో మూడు, మణుగూరు డివిజన్‌లోని ఐదింటికి రెండు, పాల్వంచ డివిజన్‌లో నాలుగుకు రెండు, వైల్డ్‌లైఫ్ డివిజన్ పరిధిలోని ఐదు యూనిట్లలో మూడు, కొత్తగూడెం డివిజన్ పరిధిలోని నాలుగు యూనిట్లలో ఒకటి, ఇల్లెందు డివిజన్ పరిధిలోని ఎనిమిది యూనిట్లలో ఆరు యూనిట్లను కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. ఇక ఖమ్మం జిల్లాలోని ఖమ్మం డివిజన్‌లో రెండు, సత్తుపల్లి డివిజన్‌లో మూడింటికి ఒక్క యూనిట్ కూడా అమ్ముడుపోకపోవడం గమనార్హం. అలాగే, మహబూబాబాద్ జిల్లాలోని మహబూబాబాద్ డివిజన్‌లో ఐదు యూనిట్లకు ఒకటి, గూడూరు డివిజన్‌లో పదింటికి ఏడు యూనిట్లను కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. ఈమేరకు మిగిలిన 26 యూనిట్లను అప్పగించేందుకు నాలుగో దఫా టెండర్ల ఆహ్వానించగా ఏ మేరకు ఫలితం వస్తుందో వేచి చూడాల్సిందే.

చెక్కల ఇల్లు వచ్చేసింది !

- 50 గజాల స్థలంలో ఏర్పాటు
- రూ.6.50 లక్షల వ్యయంతో నిర్మాణం



చెక్క ఇంటిని పరిశీలిస్తున్న స్థానికులు (ఇన్‌సెట్) ఇంటి లోపల భాగం

పునాది తీసేది లేదు.. సిమెంట్, రాళ్లు, ఇసుక కలిపేది లేదు. పైగా అతి కొద్ది స్థలంలోనే ఇంటిని తీసుకొచ్చి పెడుతున్నారు. ఇలా నేలకొండపల్లిలోని ఓ వెంచర్‌లో చెక్కల ఇల్లు ఏర్పాటు చేయగా ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. హైదరాబాద్‌లో చెక్కలతో నిర్మించిన ఈ ఇంటిని ఇక్కడికి తీసుకొచ్చి 50 గజాల స్థలంలో ఏర్పాటు చేశారు. బెడ్‌రూమ్, సిట్ రూమ్, హాల్, అటాచ్డ్ బాత్‌రూమ్ గల ఈ ఇంటికి రూ.6.50 లక్షల వ్యయం అయిందని వెంచర్ నిర్వాహకులు రంగిశెట్టి వెంకటప్పయ్య, రావెళ్ల కృష్ణారావు, మేనేజర్ సురేష్‌నాయడు తెలిపారు. ఈ ఇంటిని తిలకించేందుకు ప్రజలు భారీగా తరలివస్తున్నారు.

– నేలకొండపల్లి

రైతుల రుణమాఫీ చేయాలి

మధిర: ఎన్నికల సమయాన ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మధిరలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రమాణ స్వీకారం రోజునే రైతులకు రూ.2 లక్షల వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ఆ దిశగా కార్యాచరణ ప్రారంభించకపోవడం రైతాంగాన్ని మోసం చేయడమేనని తెలిపారు. అధికారంలోకి రావడానికి అనేక సంక్షేమ పథకాలను ప్రకటించి ఇప్పుడు విస్మరిస్తున్నారని విమర్శించారు. ఇకనైనా రుణాలు మాఫీ చేయడంతోపాటు అర్హులందరికీ రైతుబంధు నగదు జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ మధిర నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, నాయకులు చిలివేరు సాంబశివరావు, పాపట్ల రమేష్, గుండా చంద్రశేఖర్‌రెడ్డి, ఉపేంద్ర, కృష్ణారావు, నాగభూషణం, రామకృష్ణ, రవీందర్, రమేష్, ప్రణీత్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి